క్లుప్తంగా

గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మల్యాల గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

నందికొట్కూరు: గోకులం షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం మండలంలోని మల్యాల, అల్లూరు గ్రామంలోని గోకులం షెడ్ల నిర్మాణాలను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు రైతులకు సహకారం అందిస్తామన్నారు.

భుజంగేశ్వరునికి అన్నాభిషేకం



పూజలందుకున్న భుజంగేశ్వరస్వామి

జూపాడుబంగ్లా: స్థానిక భుజంగేశ్వరాలయంలోని శివలింగానికి కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం శివభక్తులు భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం నిర్వహించారు. అర్చకులు ఉమామహేశ్వరశర్మ వేదమంత్రాలను పఠిస్తుండగా శివభక్తులు వండిన అన్నాన్ని శివలింగానికి సమర్పిస్తూ స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన తదితర విశేష పూజలు చేశారు.

ఆర్డీఓ కార్యాలయం పరిశీలన



ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న భూ సర్వేల వివాదాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈమె వెంట ఆర్డీఓ నాగజ్యోతి, సిబ్బంది ఉన్నారు.

వన దేవతలకు పూజలు



గ్రామ వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల కేంద్రంలో వెలసిన వన దేవతల(గజ్జల పాపమ్మ, వసుదేవమ్మ, రామలక్ష్మమ్మ)కు కార్తీక చివరి శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యే పూజలు నిర్వహించారు. అమ్మవార్లను అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన తదితర పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బెల్లంతో తయారు చేసిన కుడుములు, కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రైతులు ఎద్దుల బండ్లలో వచ్చి వనంలో వనభోజనాలు చేసి, సాయంత్రం వరకు సందడి చేశారు.

పరిశ్రమల అభివృద్ధికి సర్వే



బండిఆత్మకూరులోని స్పేర్ పార్ట్స్ షాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బండిఆత్మకూరు: సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) గుర్తించి వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టిందని ఎంపీడీఓ దస్తగిరి అన్నారు. శుక్రవారం నుంచి మండల పరిధిలోని గ్రామాల్లోని సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల ఉద్యమం పోర్టల్‌లో నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సర్వేతో పరిశ్రమలకు రాయితీలతో పాటు, బ్యాంకు రుణాలు కూడా పొందవచ్చన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేద్దాం

పాములపాడు: జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం కార్యక్రమం నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ సభ్యుడు పాలూరి సత్యమయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విజయవాడలో భారీ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి విరాట్‌పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం ఆవరణంలో డిసెంబర్ 1న మండల సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి హిందువులు ప్రతి గ్రామం నుంచి రావాలన్నారు.

వరి రైతులకు 'మద్దతు' ఏదీ?

- ఎక్కడా అమలు కాని కనీస మద్దతు ధర
- కనిపించని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- ఆందోళన చెందుతున్న వరి రైతులు

వరి రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేకపోవడంతో దళారుల చేతిలో అన్నదాతలు మోసపోతున్నారు. వారు అడిగినంతకే దిగుబడులను విక్రయించుకుంటుండటంతో లాభాలు కాదుకదా కనీసం పెట్టుబడులు కూడా చేతికి రాక అప్పుల పాలవుతున్నారు. అధికారులు స్పందించి కేంద్రాలు ఏర్పాటు చేసి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు. – ఆత్మకూరురూరల్



సాగైన వరి పొలం

ఆత్మకూరు డివిజన్‌లో ఈ ఏడాది సుమారు 7 వేల హెక్టార్లలో రైతులు వరిని పండించారు. ఎకరాకు దాదాపు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారు. దిగుబడులు ఎకరాకు సుమారు 40 బస్తాల వరకు వచ్చాయి. అయితే ధర అంతంత మాత్రమే ఉండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది బస్తా రూ.2,600 ఉండగా ప్రస్తుతం వ్యాపారులు కేవలం రూ.1,400 కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాకపోవడంతో బస్తాపై రూ.1,200 చొప్పున నష్టపోతున్నారు. కౌలు రైతులది మరింత దయనీయమైన స్థితి. ఎకరాకు 16 బస్తాలు కౌలుగా భూయజమానికి చెల్లించాల్సి ఉంది.

మంత్రి వ్యాఖ్యలు అర్థ రహితం..

కృష్ణా జిల్లాలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతుల ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేస్తామని చెబుతున్నా అది కోస్తా జిల్లాలకు మాత్రమే అన్నట్లుగా ఉంది. రాయలసీమలో అందులోనూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దిగుబడులు చేతికందుతుండటంతో రైతులు ఒకవైపు సంతోషంగా ఉన్నా.. ధర లేక దిగాలు చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధరల స్థిరీకరణ కోసం రూ.3,000 కోట్ల నిధిని రిజర్వ్‌లో ఉంచేవారు. దీంతో మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తి ఏదైనా కేంద్ర ప్రభుత్వ కనీస మద్దతు ధరకు చేరలేక పోతే ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేది. కూటమి ప్రభుత్వం మాత్రం పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలు అమలు పరుస్తోంది. కనీస మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి మీనమేషాలు లెక్కిస్తోంది.

వరి రైతులను ఆదుకోవాలి



పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టి పంట పండించిన వరి రైతులు ధరలు పడిపోవడంతో కోలుకోలేనంతగా నష్టపోతున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ప్రాంతీయ వివక్షకు పాల్పడుతూ కేవలం కోస్తా రైతుల ధాన్యాన్ని మాత్రమే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు నిర్ణయించడం సబబు కాదు. ఉమ్మడి కర్నూలు, కడప అనంతపురం జిల్లాల్లో కూడా పెద్ద ఎత్తున వరి సాగు చేశారు. రాష్ట్రంలోని రైతులందరినీ ఆదుకోవాలి.
– పురుషోత్తం రెడ్డి, రైతు, వీరాపురం, కొత్తపల్లె మండలం

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు: నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సునీత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారులు సుబ్బన్న, వెంకటరమణ, ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఆరు కంపెనీల్లో పని చేసేందుకు 42 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరు కాగా 29 మంది యువకులు ఎంపిక అయ్యారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీఏపీ, సీడప్ సంస్థలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, నిరుద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

పాములపాడు: ప్రధానమంత్రి పసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో పంటగా సాగు చేసిన రైతులు తుపానులు, కరువు, అకాల వర్షాలు, దిగుబడి ఆధారిత ద్వారా నష్టపోయిన పంటలకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని చెప్పారు. బీమా చేసుకోదలిచిన రైతులు ఎకరా చొప్పున శనగ రూ.84, జొన్న రూ.59.60, మినుము రూ.47.60, వరి రూ.126, ఉల్లిగడ్డ రూ.90 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రబీ పంటల నమోదు తప్పనిసరి



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

వెలుగోడు: రబీ పంట నమోదు తప్పనిసరి అని ఏడీ ఆంజనేయ, ఏవో పవన్ కుమార్ అన్నారు. శుక్రవారం వారు పంటల నమోదు ప్రక్రియ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రబీలో సాగు చేసిన రైతులు పంట నమోదు కచ్చితంగా చేసుకోవాలని, పంట నమోదు ఉపయోగాలను రైతులకు వివరించారు. పంట బీమా చేసుకోవడానికి డిసెంబర్ 15 ఆఖరి తేదీ, వరికి డిసెంబర్ 31 తేదీ అని తెలిపారు. ఎన్‌పీ ఎస్ఎస్ యాప్‌లో పురుగు, తెగుళ్ల బారిన పడిన పంటలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే అధికారులు పరిశీలించి యాజమాన్య పద్ధతులను వివరిస్తారన్నారు. వారి వెంట అంజిత్ కుమార్ రెడ్డి, సుధారాణి, రైతు సేవ కేంద్రం సిబ్బంది రామకృష్ణ, వెంకట శివ, నాగమణి పలువురు రైతులు పాల్గొన్నారు.

పొలాలకు దారి లేకుండా హైవే రోడ్డు నిర్మాణాలు

- ఎమ్మెల్యేకు రైతుల ఫిర్యాదు



రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జేసీ

నందికొట్కూరు: పంట పొలాలకు వెళ్లేందుకు రహదారి లేకుండా నేషనల్ హైవే నిర్మాణం చేపట్టారని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌కు, ఎమ్మెల్యే జయసూర్యకు నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు మండలాలకు చెందిన రైతులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పొంట పొలాలకు రహదారులు ఏర్పాటు చేస్తామని చెప్పిన కాంట్రాక్టర్లు .. హైవే నిర్మాణం పూర్తయినా ఇంత వరకు పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. దారిలేక అనేక అగచాట్లు పడుతున్న అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతుల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విష్ణు చరణ్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు ప్రసాదరెడ్డి, హరిసర్వోత్తమ రెడ్డి, ఖలీల్‌బేగ్, లక్ష్మినారాయణ, భాస్కరరెడ్డి తదితరులు ఉన్నారు.

మాలల సింహ గర్జనను జయప్రదం చేయండి



అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాలమహానాడు జిల్లా నాయకులు

నందికొట్కూరు: డిసెంబరు 1న హైదరాబాద్‌లో మాలల సింహ గర్జన సభను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా నాయకులు కడియం సాంబశివుడు కోరారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు నగేష్, మనోహర్, సుంకన్న, తిక్కస్వామి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



అసంపూర్తిగా వదిలేసిన డంప్‌యార్డ్‌ను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

పగిద్యాల: మండలంలోని పడమర ప్రాతకోట పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలోని అసంపూర్తిగా వదిలేసిన డంప్‌యార్డ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను ఎక్కడిపడితే అక్కడ పారవేస్తున్నారన్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ కాలనీలలో పేరుకుపోయిన చెత్తచెదారం కారణంగా ప్రజలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో చెత్తచెదారం పేరుకుపోతోందన్నారు. స్థానికంగా ఉండి ప్రజలకు సేవలు అందించాల్సిన పంచాయతీ కార్యదర్శి జిల్లా కేంద్రం నుంచి విధులకు హాజరు కావడం తగదన్నారు. తక్షణమే గ్రామంలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించాలని, అసంపూర్తిగా వదిలేసిన డంప్‌యార్డ్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబానికి రూ.25 లక్షలు అందజేత

కొలిమిగుండ్ల: కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో ఈనెల 3న జరిగిన ప్రమాదంలో మృతి చెందిన సురేష్‌ఆచారి కుటుంబాన్ని రామ్‌కో యాజమాన్యం ఆదుకుంది. శుక్రవారం ఫ్యాక్టరీ కార్యాలయంలో మృతుడి తల్లి సుబ్బలక్షుమ్మకు రూ.25 లక్షల చెక్‌ను యూనిట్ ఇన్‌చార్జ్ రెడ్డినాగరాజు, అడ్మిన్ హెడ్ రామరాజు అందజేశారు. రామ్‌కో యాజమాన్యానికి సుబ్బలక్షుమ్మ కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో సీనియర్ జనరల్ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు. కాగా వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం దన్నవాడకు చెందిన సురేష్‌ఆచారి ఫ్యాక్టరీలో కాంట్రాక్టర్ కింద పని చేస్తుండేవాడు.

జగనన్న కాలనీలో తాగునీటి పైపు లీకేజీ



జగనన్నకాలనీలో తాగునీటి పైపుల లీకేజీ వల్ల ఇళ్లపాదుల్లో నిలిచిన నీరు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలోని జగనన్న కాలనీలో తాగునీటి పైపు లీకేజీ అవుతుండటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో సుమారు 120 మంది గృహాలు నిర్మించుకుని నివసిస్తున్నారు. కాలనీలో ఏర్పాటుచేసిన తాగునీటి కుళాయి పైపులు లీకేజీ అయ్యి ఇళ్ల నిర్మాణం కోసం తవ్విన గుంతల్లో నిల్వ ఉండటంతో వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది బర్రెలు, గొర్రెల కాపర్లు నిల్వ ఉన్న నీటిలో బర్రెలను దింపుతుండటంతో తాగునీరు కలుషితం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని అధికారులు, గ్రామసర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని తాగునీటి పైపులకు మరమ్మతులు నిర్వహింపజేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బైకులు ఢీ..ఇద్దరికి గాయాలు

మహానంది: సీతారామపురం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మోత్కులపల్లె గ్రామానికి చెందిన ఇద్దరు బైకుపై వెళ్తుండగా సీతారామపురం గ్రామానికి చెందిన మరో ఇద్దరు వెళ్తున్న బైకు రెండూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కేశవరెడ్డి, మరొకరు గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బీమా చేయించండి

మహానంది: సాగు చేసిన పంటలకు రైతులతో బీమా చేయించాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి సూచించారు. బుక్కాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఎకరాకు రూ.126, జొన్నకు రూ.60, మినుముకు రూ.48 చొప్పున బీమా ప్రీమియం చెల్లించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

నాగలూటి ఎఫ్ఆర్‌ఓగా శ్రీనివాస్

ఆత్మకూరు రూరల్: స్థానిక అటవీ డివిజన్‌లోని నాగలూటి ఎఫ్ఆర్‌ఓగా శ్రీనివాస్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎఫ్ఆర్ఓ దొరస్వామిని తిరుపతికి, తిరుపతిలో పని చేస్తున్న శ్రీనివాస్‌ను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు.

సర్వే పక్కాగా చేయండి

కొత్తపల్లి: గ్రామాల్లో ఎంఎస్ఎంఈ(మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్) సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ మేరి సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని దుద్యాల, కొత్తపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు గాను 288 హోటల్స్, కిరాణం, జనరల్‌స్టోర్స్, మెడికల్, చీరలు, బియ్యం మిల్లులు, పురుగుల మందుల, వివిధ రకాల వ్యాపారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

- **పగిడ్యాల:** చిరు వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారి వ్యాపారాలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఎంఎస్ఎంఈ సర్వేను చేపట్టినట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. మండలంలో దాదాపు 184 మంది వివిధ వ్యాపారాలు సాగిస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరి డేటాను ఆన్‌లైన్ చేసేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సర్వేలు వంద శాతం పూర్తి చేయాలి

వెలుగోడు: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన సర్వేలను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జమీఉల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామపంచాయతీ సిబ్బందితో స్వర్ణ పంచాయతీ సర్వే, హౌస్ హోల్డ్ జియో టాకింగ్, ఎన్‌పీసీఐ సర్వేను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. శనివారం నుంచి పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఉదయం 6 గంటల నుంచి మొదలుపెట్టి సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఓఆర్డీ మురారి, సచివాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది ముజీబ్, ఇర్ఫాన్‌లు పాల్గొన్నారు.

డాక్టర్ రవికృష్ణకు పురస్కారం



డాక్టర్ రవికృష్ణ

నంద్యాల(వ్యవసాయం): నిస్వార్థంగా సామాజిక సేవ అందించిన వారికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఏటా జాతీయ మహాసభల సందర్భంగా ప్రకటించే ప్రతిష్టాత్మక డాక్టర్ జ్యోతిప్రసాద్ గంగూలీ స్మారక పురస్కారానికి నంద్యాలకు చెందిన ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా నంద్యాలలో చేపడుతున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పురస్కారాన్ని డిసెంబర్ 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 99వ ఐఎంఏ జాతీయ మహాసభల్లో అందజేయనున్నారని చెప్పారు. అందుకుగాను ఐఎంఏ నాయకులు నందకిశోర్, సుభాష్‌చంద్రబోస్, విజయభాస్కరరెడ్డి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా సింధు సుబ్రహ్మణ్యం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేటర్‌గా సింధు సుబ్రహ్మణ్యంను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఆసుపత్రి పరిపాలనకు సంబంధించి అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు సమాచారం.

కల్యాణం.. కమనీయం



హాజరైన భక్తజనం



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: స్థానిక శివాలయంలో శివపార్వతుల కల్యాణం శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో ముస్తాబు చేసి వేద పండితులు మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణ మధ్య కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకముందు భక్తులు ఆలయ అలంకరణకు ప్రత్యేక పుష్పాలంకరణ, మంగళవాయిద్యాల నడుమ పుట్టమన్ను తెచ్చి అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

మహానందీశ్వరుడికి లక్ష బిల్వార్చన



అష్టోత్తర శంఖ పూజా దృశ్యం



లలితాదేవి అమ్మవారికి మంగళహారతీ ఇస్తున్న పురోహితులు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీక మాసం, మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీ మహానందీశ్వర స్వామికి లక్ష బిల్వార్చన పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. వేదపండితులు, రుత్వికుల వేద మంత్రోచ్చారణలతో మహానంది ఆలయ ప్రాంగణం పులకించిపోయింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, దాతలు గడ్డం రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన లక్ష బిల్వార్చన పూజల్లో భాగంగా వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, రుత్వికులు, అర్చకులు గణపతిపూజ, గోపూజ, కంకణ ధారణలతోపాటు మహానందీశ్వరస్వామికి లక్ష బిల్వాలతో అర్చన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేపట్టారు. లక్ష బిల్వార్చన ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగగా రాత్రి అష్టోత్తర శంఖ పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు పూజల్లో పాల్గొని మహానందీశ్వరుడి అనుగ్రహం పొందారు. కాగా కామేశ్వరీదేవికి శనివారం లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీశైలం శ్రీనివాసులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమ తీరం సంగమేశ్వరంలోని ఉమామహేశ్వరాలయంలో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో భక్తులు కార్తీక మాస ప్రత్యేక పూజలు చేసుకున్నారు. బహుళ త్రయోదశి శుక్రవారం రోజున ప్రదోష సమయంలో శ్రీలలిత పరమేశ్వర స్వామివారికి రుద్రాభిషేక పూజలు మంగళహారతులు నిర్వహించారు. విజయవాడ నుంచి వచ్చిన భక్తులచే శివలింగానికి కృష్ణా జలాలతో అభిషేకాలు, మంగళహారతి వంటి విశేషపూజా కార్యక్రమాలు చేసుకున్నారు. మహిళలచే కార్తీకదీపోత్సవం, మాసశివరాత్రి కార్తీకమాస దీపోత్సం, సాయం సంధ్యా సమయంలో సాయం సంధ్యావందనం, సూర్యుడికి అర్ఘ్యములు వంటి పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలని జేసీకి వినతి

జూపాడుబంగ్లా: ఎన్‌హెచ్ 340సీ రోడ్డుకు అనుసంధానంగా తాటిపాడు గ్రామానికి రాకపోకలు జరిగేలా సర్వీసు రోడ్డును నిర్మించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు జేసీ విష్ణుచరణ్‌ను కోరారు. శుక్రవారం జేసీతోపాటు ఎన్‌హెచ్340సీ పీడీ పద్మజ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. తాటిపాడు గ్రామ అంచెవద్దకు రాగానే గ్రామస్తులు జేసీని కలిసి సమస్యను విన్నవించడంతో ఆయన సమీపంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామానికి వెళ్లేంకు నిర్మించిన కల్వర్టు ఎత్తు తక్కువగా ఉండటంతో ఇబ్బందికరంగా ఉంటుందని, పొలాలకు వెళ్లేందుకు ధాన్యం లారీలు, కోతమిషన్లు, ట్రాక్టర్లు, ఎద్దులబండ్లు వెళ్లటం కష్టసాధ్యంగా ఉంటుందని రైతులు జేసీకి వివరించారు. సర్వీసు రోడ్డు నిర్మించేలా ఆదేశాలు జారీచేస్తానని జేసీ హామీ ఇచ్చారు. అలాగే 80 బన్నూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 649ఏ/2బీ లోని 1.25 ఎకరాల భూమిలో పెట్రోల్ బంకు ఏర్పాటు నిమిత్తం అవసరమైన ఎన్‌ఓసీ మంజూరు చేయటానికి వీలుగా జేసీ స్థలాన్ని పరిశీలించారు. కృష్ణరావుపేట ఈద్గా స్థలాన్ని పరిశీలించి పంటకాల్వ తవ్వకం సమస్యను రైతులను అడిగి తెలుసుకున్నారు.